ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
గురువారం 15 ఫిబ్రవరి 2024

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవోలు 8లో..

సమ్మెకు కార్మికులు దూరంగా ఉండండి 8లో..



ఏఐసీసీ పరిశీలనకు ఐదుగురి పేర్లు

- పెద్దపల్లి ఎంపీ టికెట్ కోసం 29 మంది దరఖాస్తు
- దరఖాస్తులను పరిశీలించి షార్ట్ లిస్టు చేసిన టీపీసీసీ
- కాంగ్రెస్‌లో చేరిన ఎంపీ వెంకటేశ్ నేత పేరు కూడా పరిశీలనలోనే

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పెద్దపల్లి పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీలో పోటీ చేసే వారి సంఖ్య విపరీతంగా పెరగడంతో ఇటీవల సమావేశమైన టీపీసీసీ స్ర్కీనింగ్ కమిటీ వచ్చిన దరఖాస్తుల నుంచి ఐదుగురి పేర్లను ఏఐసీసీకి పంపించారని సమాచారం. టీపీసీసీ పంపిన వారి పేర్లతో పాటు స్ర్కీనింగ్ కమిటీ సమావేశం జరిగిన తర్వాత బీఆర్ఎస్ పార్టీకి చెందిన పెద్దపల్లి సిట్టింగ్ ఎంపీ బొర్లకుంట వెంకటేశ్ నేత కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో ఆయన పేరు కూడా పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతున్నది. రాష్ట్రంలో పెద్దపల్లి, వరంగల్, నాగర్ కర్నూల్ స్థానాలను ఎస్సీలకు రిజర్వు చేయడంతో సామాజిక సమీకరణాలను దృష్టిలో పెట్టుకుని మూడు చోట్ల వేర్వేరుగా మాల, మాదిగ, నేత కాని సామాజిక వర్గాలకు చెందిన వారికి టికెట్లు ఇవ్వాలని పార్టీ ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెజారిటీ సీట్లు సాధించి అధికారంలోకి వచ్చింది. గత పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ, భువనగిరి, మల్కాజ్‌గిరి స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలుపొందిన విషయం తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్, ఖమ్మం, వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీ ఎక్కువ స్థానాలను గెలుచుకున్నది. సిట్టింగ్ స్థానాలతో పాటు మరో 10 స్థానాలను గెలుచుకునే దిశగా పార్టీ పావులు కదుపుతున్నది.

● అసెంబ్లీ ఎన్నికల్లో క్లీన్‌స్వీప్..

పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొంది క్లీన్ స్వీప్ చేసిన విషయం తెలిసిందే. అయితే ఇక్కడి నుంచి పోటీచేస్తే టికెట్ సాధిస్తే గెలుపు నల్లేరు మీద నడకేనన్న అభిప్రాయం పార్టీ నాయకుల్లో ఏర్పడింది. టీపీసీసీ జనవరి 31 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు పోటీ చేయాలనుకునే వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. ఆ మేరకు పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలకు చెందిన ఆశావహులు 29 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రధానంగా మాజీ ఎంపీ వివేక్ తనయుడు గడ్డం వంశీకృష్ణ, గొమాసే శ్రీనివాస్, మాజీ ఎంపీ డాక్టర్ సుగుణకుమారి, యువజన నాయకుడు ఊట్ల వరప్రసాద్, ఆసంపెల్లి శ్రీనివాస్, బూడిద మల్లేశం, పెర్క శ్యామ్, తెలంగాణ ఉద్యమకారుడు ఈర్ల సురేందర్, దుర్గం అశోక్, తదితరులు దరఖాస్తు చేసుకున్నారు. టికెట్ కోసం ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. పెద్దపల్లి పార్లమెంట్ టికెట్‌ను మాదిగ సామాజికవర్గానికి చెందిన స్థానికులకే ఇవ్వాలనే డిమాండ్ రోజురోజుకు పెరుగుతున్నది. ఆ సామాజిక వర్గానికి చెందిన ప్రజా సంఘాల నాయకులు టీపీసీసీ నుంచి మొదలుకుని ఏఐసీసీ నేతల వరకు వినతిపత్రాలు అందజేశారు. పెద్దపల్లి పార్లమెంట్ ఏర్పాటైన నాటి నుంచి గత ఎన్నికల్లో ఆగం చంద్రశేఖర్‌కు మినహా మాదిగలకు టికెట్ ఇవ్వలేదని చెబుతున్నారు. ఇదిలా ఉండగా పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేత అనూహ్యంగా కారు దిగి కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ టికెట్ ఇస్తామని హామీ ఇచ్చిన కారణంగానే ఆయన కాంగ్రెస్‌లో చేరినట్లుగా ప్రచారం జరుగుతున్నది. స్ర్కీనింగ్ కమిటీ సమావేశం అయిన తర్వాత వెంకటేశ్ నేత కాంగ్రెస్‌లో చేరారు. అంతకు ముందే స్ర్కీనింగ్ కమిటీ వచ్చిన దరఖాస్తులను పరిశీలించి షార్ట్ లిస్టు తయారు చేసినట్లు సమాచారం. అందులో గడ్డం వంశీకృష్ణ, గొమాసే శ్రీనివాస్, ఊట్ల వరప్రసాద్, ఆసంపెల్లి శ్రీనివాస్, ఇంకా పార్టీలో చేరకుండా తటస్థురాలిగా టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న మాజీ ఎంపీ డాక్టర్ సుగుణకుమారి పేర్లను ఏఐసీసీకి పరిశీలన కోసం పంపించారని తెలిసింది. మాల సామాజిక వర్గానికి చెందిన వారికి టికెట్ ఇవ్వాల్సి వస్తే గడ్డం వంశీకృష్ణకు దక్కవచ్చని, మాదిగలకు ఇవ్వాల్సి వస్తే మాజీ ఎంపీ డాక్టర్ సుగుణ కుమారి, ఊట్ల వరప్రసాద్, ఆసంపెల్లి శ్రీనివాస్‌లో ఎవరో ఒకరికి దక్కవచ్చని పార్టీలో చర్చ జరుగుతున్నది. నేత కాని సామాజిక వర్గానికి చెందిన వారికి ఇవ్వాల్సి వస్తే ఎంపీ వెంకటేశ్ నేతకు గానీ, గొమాసే శ్రీనివాస్‌కు గానీ ఇవ్వవచ్చని తెలుస్తున్నది. టీపీసీసీ పంపిన జాబితాలోని వారికే గాకుండా ఏఐసీసీ అనూహ్యంగా ఇంకా ఎవరైనా అభ్యర్థిని ప్రకటించినా ఆశ్చర్య పోవాల్సిన అవసరం లేదు. అయినా ఎవరి ప్రయత్నాలను వారు చేసుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన సిట్టింగ్ ఎంపీ వేంకటేశ్ నేతకు దక్కుతుందా, దరఖాస్తు చేసుకున్న వారిలో ఒకరికి దక్కుతుందా అనే ఉత్కంఠ నియోజకవర్గంలో నెలకొన్నది.

పెద్దపల్లి ఏసీపీగా జి కృష్ణ



పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 14: పెద్దపల్లి ఏసీపీగా గజ్జి కృష్ణను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడి పనిచేసిన ఏసీపీ ఎడ్ల మహేష్‌ను నారాయణపేట్ జిల్లా కేంద్రానికి బదిలీ అయ్యారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బదిలీలు జరుగుతున్నట్లు డీసీపీ చేతన తెలిపారు. గతంలో గజ్జి కృష్ణ ఈ ప్రాంతంలో బసంత్‌నగర్, గోదావరిఖని, కాటారం, మంథని పోలీస్‌స్టేషన్లలో పనిచేశారు. కాల్వ శ్రీరాంపూర్‌లో పనిచేసే సమయంలో అక్కడ చెంచులకు తన సొంత ఖర్చులతో ఇళ్లు కట్టించి ఓ కాలనీని ఏర్పాటు చేశారు. అప్పుడే రాష్ట్రస్థాయిలో కృష్ణకు మంచిగుర్తింపు లభించింది. హన్మకొండ ఏసీపీగా పనిచేస్తున్న ఆయన పెద్దపల్లికి బదిలీకాగా గురువారం బాధ్యతలు తీసుకోనున్నారు.

గోదావరిఖని ఏసీపీగా మడక రమేష్



కోల్‌సిటీ, ఫిబ్రవరి 14: గోదావరిఖని ఏసీపీగా మడక రమేష్‌ను నియమిస్తూ డీజీపీ రవి గుప్తా ఆదేశాలు జారీ చేశారు. ఇక్కడ పని చేస్తున్న తులా శ్రీనివాసరావును డీఐజీ ఆఫీస్‌లో రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. డీఐజీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న మడక రమేష్‌ను గోదావరిఖని ఏసీపీగా నియమిస్తూ ఆయన ఆదేశాలు జారీ చేశారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్డీవో సమావేశం

మంథని, జనవరి 14: మంథని నియోజకవర్గంలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంథని ఆర్డీవో కార్యాలయంలో ఈఆర్వో హనుమా నాయక్ బుధవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నియోజకవర్గ స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగే వార సమీక్ష భాగంగా ఆర్డీవో సమావేశమయ్యారు. ఓటర్ల జాబితా సవరణ, పార్లమెంట్ ఎన్నికల సన్నాహక చర్చ తోపాటు వివిధ అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నేత శశిభూషన్‌కాచే, వివిధ పార్టీల నేతలు నియోజకవర్గంలోని 10 మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

రామగుండం కార్పొరేషన్ కమిషనర్‌గా శ్రీకాంత్



కోల్‌సిటీ, ఫిబ్రవరి 14: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ నూతన కమిషనర్‌గా సీహెచ్ శ్రీకాంత్‌ను నియమిస్తూ మున్సిపల్ ప్రిన్సిపాల్ సెక్రటరీ దాన కిశోర్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 74మంది కమిషనర్లు బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న సీహెచ్ నాగేశ్వర్‌ను హైదరాబాద్ జీహెచ్ఎంసీకి బదిలీ చేయగా రంగారెడ్డి జిల్లాలో తుర్కయంజల్ కమిషనర్‌గా పని చేస్తున్న శ్రీకాంత్‌ను రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా నియమించారు.

విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడడం బాధాకరం

రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్


ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 14: రామగుండం మెడికల్ కళాశాలలో బాయ్స్ హాస్టల్‌లో సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులను ర్యాగింగ్ చేయడం బాధాకరమని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. విద్యార్థులు సోదర భావంతో మెలగాలని, సీనియర్లు జూనియర్లకు ఆదర్శంగా ఉండాలే తప్ప ఇలా ర్యాగింగ్‌కు పాల్పడవద్దని, ర్యాగింగ్‌ను నిరోధించడానికి ఒక కమిటీని వేయాలని కళాశాల ప్రిన్సిపాల్‌కు సూచించారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. విద్యార్థులకు ర్యాగింగ్‌పై అవగాహన కల్పించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు.

సాగు, తాగునీటిలో బీఆర్ఎస్ ప్రభుత్వం ద్రోహం

- పత్తిపాక రిజర్వాయర్ ఏర్పాటు ఏమైంది?
- ఎల్లంపల్లి నీరు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చుక్క రాలేదు
- అసెంబ్లీలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్


అసెంబ్లీలో మాట్లాడుతున్న అడ్లూరి

ధర్మారం, ఫిబ్రవరి 14: సాగు, తాగు నీటి విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ద్రోహం చేసిందని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆరోపించారు. బుధవారం అసెంబ్లీలో సాగు, తాగు నీటి విషయంలో కరీంనగర్ ఉమ్మడి జిల్లాకు జరిగిన అన్యాయాన్ని కేటీఆర్, హరీష్‌రావును ఉద్దేశించి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రస్తావించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ధర్మపురి నియోజకవర్గ పరిధిలోని ధర్మారం మండలం నందిమేడారం వద్ద రిజర్వాయర్ నిర్మించి కరీంనగర్ ఉమ్మడి జిల్లాకు సాగు నీరు ఇవ్వకుండా మిడ్ మానేరు నుంచి సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్‌కు ఎల్లంపల్లి నీటిని తరలించారని ఆయన పేర్కొన్నారు.

అదేవిధంగా నంది మేడారం రిజర్వాయర్‌తో పాటు మండలంలోని పత్తిపాకలో లక్ష్మీనర్సింహ స్వామి రిజర్వాయర్ ఏర్పాటు చేస్తామని అప్పటి మంత్రి హరీష్‌రావు పత్తిపాకలో పల్లె నిద్ర చేసి హామీ ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. ధర్మారం, వెల్గటూర్ మండలాలకు, ధర్మపురి నియోజకవర్గానికి సాగు, తాగు నీటిని అందించేందుకు పత్తిపాకలో రిజర్వాయర్ నిర్మిస్తామని 2016-17లో అప్పటి సీఎం అసెంబ్లీ సాక్షిగా ప్రకటించారని ఆయన గుర్తుచేశారు. రిజర్వాయర్ నిర్మాణాన్ని పక్కన పెట్టి కాళేశ్వరం లింకు-2 ప్రాజెక్టును రూ. 20వేల కోట్లతో చేపట్టి ధర్మపురి నియోజకవర్గంలోని 1700 ఎకరాల భూములను రైతుల వద్ద నుంచి పోలీసులతో లాక్కున్నారని ఆయన ఆరోపించారు. ఈ విషయంలో తనపై 13 కేసులు పెట్టారని, జీవన్‌రెడ్డిపై కూడా కేసులు పెట్టారని ఆయన ఆరోపించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి కరీంనగర్ ఉమ్మడి జిల్లాకు చుక్క రాలేదని ఆయన ఎద్దేవా చేశారు. ఈ విషయంలో శ్వేత పత్రం విడుదల చేస్తామని చెప్పారు. ఈ ప్రాంతానికి ఇప్పటి వరకు శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్, వరద కాలువ ద్వారా మాత్రమే సాగు నీరు అందుతుందని ఆయన చెప్పారు.

గ్యారంటీ పథకాలను ఎప్పుడు అమలు చేస్తారని హరీష్‌రావు, కేటీఆర్ ఏకవచనంతో మాట్లాడడం, దళిత వర్గానికి చెందిన స్పీకర్‌ను ఏయ్..ఎయ్ అని మాట్లాడడం, బలహీన వర్గాలకు చెందిన పొన్నం ప్రభాకర్‌ను కూచో..కూచో అంటు కేటీఆర్ మాట్లాడడం ఏమిటి అని ఆయన ప్రశ్నించారు. హరీష్‌రావు, కేటీఆర్ మాట్లాడే ధోరణిపై ఆలోచించాలని ఆయన అన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చేసిన అన్యాయంపై సమయం ఇస్తే పూర్తి వివరాలు వివరిస్తానని ఆయన కోరారు.

నేరాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు

- ర్యాగింగ్ ఘటన కలిచి వేసింది - భూమాఫియాలపై ఉక్కుపాదం - రామగుండం సీపీ వీ శ్రీనివాసులు


సీపీగా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాసులు, గౌరవ వందనం స్వీకరిస్తున్న సీపీ

కోల్‌సిటీ, ఫిబ్రవరి 14: రామగుండం పోలీస్ కమిషరేట్‌లో నేరాల నియంత్రణపై పకడ్బందీ చర్యలు చేపట్టనున్నట్టు రామగుండం సీపీ వీ శ్రీనివాసులు చెప్పారు. బుధవారం శ్రీనివాసులు పోలీసులచే గౌరవ వందనం స్వీకరించి అనంతరం సీపీగా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో నేరాల నియంత్రణపై చర్యలు చేపడుతామని, రామగుండం మెడికల్ కళాశాలలో ర్యాగింగ్ ఘటన తనను కలిచివేసిందని, ర్యాగింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులను సోదరులుగా భావించి ప్రోత్సహించాలే తప్ప భయపెట్టవద్దన్నారు. కొత్తగా మెడికల్ కళాశాలకు వచ్చే వారు గ్రామాల నుంచి వస్తూ ఉంటారని, వారిని భయబ్రాంతులకు గురి చేయవద్దన్నారు. పైశాచిక ఆనందం కోసం ర్యాగింగ్‌కు పాల్పడవద్దని, ర్యాగింగ్ నిర్మూలన కోసం కమిషనరేట్ పరిధిలోని ప్రతీ కాలేజీలో అవగాహన సదస్సును నిర్వహించనున్నట్టు, ప్రత్యేక వింగ్‌ను ఏర్పాటు చేసి కాలేజీల్లో కమిటీలు వేసి ర్యాగింగ్ నిరోధానికి చర్యలు తీసుకోనున్నట్టు చెప్పారు. గంజాయి నిర్మూలన కోసం మూలాలను పట్టి గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేస్తామని చెప్పారు. ఎవరైనా గంజాయి అమ్మినా, కొన్నా కఠిన చర్యలు తీసుకుంటామని, హెచ్చరించారు. భూ మాఫియాపై ఉక్కుపాద మోపనున్నట్టు, ఎవరైనా భూ కబ్జాలకు పాల్పడే ఉపేక్షించేది లేదన్నారు.

● అధికారులతో సమీక్ష...

రామగుండం సీపీగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఎం శ్రీనివాసులు బుధవారం పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఏ తరహా నేరాలు ఎక్కువగా నమోదు అవుతున్నాయి, పోలీస్ కమిషనరేట్‌లో భౌగోళిక పరిస్థితులు, మావోయిస్టు కదలికలపై ఆయన ఆరా తీశారు. సమీక్ష సమావేశంలో మంచిర్యాల డీసీపీ సుధీర్ కేకన్, గోదావరిఖని ఏసీపీ తులా శ్రీనివాసరావు, మంచిర్యాల ఏసీపీ తిరుపతిరెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు, వన్‌టౌన్ సీఐ ప్రమోద్ కుమార్ పాల్గొన్నారు.

ఎస్ఐకి సన్మానం

జూలపల్లి, ఫిబ్రవరి 14: జూలపల్లి ఎస్ఐ శ్రీధర్‌ను పెద్దాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు కంకనాల జ్యోతిబసు, పలువురు నాయకులు బుధవారం సన్మానించారు. ఇక్కడి నుంచి బదిలీ అయిన ఎస్ఐ వెంకటకృష్ణ పెద్దాపూర్ శ్రీయోగానందా లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 14: గోదావరిఖని సిమ్స్ మెడికల్ కళాశాలలో ర్యాగింగ్‌కు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. కళాశాల ముందు ప్లకార్డులు పట్టుకొని ర్యాగింగ్‌కు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. సిమ్స్ మెడికల్ కళాశాలలో ర్యాగింగ్ పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని బీఆర్ఎస్‌వీ నాయకులు ఇరుగురాళ్ల శ్రావణ్, చింటు కళ్యాణ్, శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ర్యాగింగ్‌ను పూర్తిస్థాయిలో అరికట్టాలని, ర్యాగింగ్ సంబంధిత నేరాలను భారత శిక్షా స్మృతిలో చేర్చాలన్నారు.

● గోదావరిఖని సిమ్స్ మెడికల్ కళాశాలకు ప్రిన్సిపల్ ఉన్నారా, లేనట్లా అన్నట్టు మారిందని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ ప్రతినిధి మద్దెల దినేష్ ఒక ప్రకటనలో ఆరోపించారు. కళాశాలలో సీనియర్లు జూనియర్లపై వికృత చేష్టలతో ఇబ్బందులు పెట్టడం సరికాదని, ప్రిన్సిపల్ విద్యార్థుల బాగోగులు ఏనాడూ పట్టించుకోలేదన్నారు. ర్యాగింగ్‌కు ప్రిన్సిపల్ బాధ్యత వహించాలని, ప్రిన్సిపల్‌ను బదిలీ చేయాలని డిమాండ్ చేశారు.

వైభవంగా వసంత పంచమి వేడుకలు


మంథనిలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు, పెద్దపల్లిలో వేడుకలు

మంథని, ఫిబ్రవరి 14: వసంత పంచమి సందర్భంగా మంథనిలోని సరస్వతీ మాత ఆలయాల్లో భక్తులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవిత్ర గోదావరినది తీరంలోని బాలసరస్వతీ, అయ్యప్ప ఆలయ ఆవరణలోని జ్ఞాన సరస్వతీ, లక్ష్మీనారాయణస్వామి ఆలయ ఆవరణలోని సరస్వతీ ఆలయాల తోపాటు సరస్వతీ శిశు మందిర్‌లో వేర్వురుగా చిన్నారులకు వేద పండితుతో సామూహిక అక్షరాభాస్యం చేయించారు. ప్రత్యేక హోమం నిర్వహించారు. అమ్మవారికి భక్తులు పసుపు, కుంకుమ, సారె, పూలు, గాజులు, వివిధ రకాల సుగంధ ద్రవ్యాలను భక్తిశ్రద్ధలతో సమర్పించి విశేషంగా పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారిని వివిధ రకాల బంగారు, వెండి అభరణాలు, నూతన వస్త్రాలతో ప్రత్యేక అలంకరణ భక్తులను కట్టిపడేసింది. భక్తులతో సరస్వతి మాత ఆలయాల్లో సందడి వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెద్దపల్లి కల్చరల్: వసంత పంచమిని పురస్కరించుకొని పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్‌లో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. వేడుకలో సరస్వతీ మాత వేషధారణలో విచ్చేసిన విద్యార్థిని అందరినీ ఆకర్షించింది. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమం లో గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ దంపతులు మరియు చిన్నారుల తల్లిదండ్రులు సరస్వతీ దేవి పూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్, రజియుద్దీన్, స్రవంతి, నవీన్, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ పరిధిలోని న్యూమారేడుపాకలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో బుధవారం సరస్వతీ అమ్మవారి హోమం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది. హోమంలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ సతీమణి మనాలి ఠాకూర్ పాల్గొన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు బుక్స్, పెన్నులను అందజేశారు. ఈపూజల్లో ఆలయ కమిటీ చైర్మన్ రాంచంద్రం, కాంగ్రెస్ నాయకులు గుండేటి రాజేష్, తిరుపతిరెడ్డి, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

కోల్‌సిటీటౌన్: వసంత పంచమి పురస్కరించుకొని పలు ఆలయాల్లో, విద్యాసంస్థల్లో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక అడ్డగుంటపల్లిలోని కృష్ణవేణి విద్యాసంస్థలలో సరస్వతి అమ్మవారికి వేదపండితుల వేద మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు తల్లిదండ్రులు పాల్గొని అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మంజులాశ్రీనివాస్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే శారదానగర్‌లోని జ్ఞాన సరస్వతి ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ నాయకురాలు కందుల సంధ్యారాణి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. సుమారు 105 మంది పిల్లలకు అక్షరాభ్యాసం చేశారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు బంక రామస్వామి పాల్గొన్నారు. స్థానిక జవహర్‌నగర్‌లోని సరస్వతీ విద్యా మందిర్‌లో అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. దాదాపు 35 మంది చిన్నారులు అక్షరాభ్యాసం చేయించారు. గాయత్రి యజ్ఞం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు సోమారపు లావణ్యఅరుణ్‌కుమార్, కార్యదర్శి గంధం రవీందర్ పాల్గొన్నారు.

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని యాపిల్ కిడ్స్ పాఠశాలలో బుధవారం వసంత పంచమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాలలో జ్ఞాన సరస్వతి దేవి పూజా, సామూహిక అక్షారభ్యాస కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల లైన్స్ క్లబ్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పిన్‌రెడ్డి కిషన్‌రెడ్డి, లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శంకర్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు బండ సాయి శంకర్, పాఠశాల కరస్పాండెంట్ చదువు వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.


ఎలిగేడు: మండలంలోని సుల్తాన్‌పూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో వసంతపంచమి సందర్భంగా సరస్వతి మాతకు ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో భరోసా స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అక్కినపల్లి నాగరాజు, సభ్యులు శివజ్యోతి, మంజుల, శ్రీనివాస్, గ్రామస్థులు పాల్గొన్నారు.


సుల్తానాబాద్: మండలంలోని పలు ప్రభుత్వ ప్రైవేట్ విద్యా సంస్థల్లో వసంత పంచమి వేడుకలు నిర్వహించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అల్ఫోర్స్, ఇండియన్ పబ్లిక్ స్కూల్, వివేకానంద, విజ్ఞాన్, కేరళ హైస్కూల్స్‌లో వేడుకలు నిర్వహించారు.



అనుమానాస్పదంగా రైతు మృతి

గన్నేరువరం, ఫిబ్రవరి 14, మండలంలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన రైతు పంబాల కొమురయ్య(55) తన వ్యవసాయ క్షేత్రంలో బుధవారం మృతి చెందాడు. మృతుడి ముఖంపైన చేతులపైన కాలిన గాయాలు ఉండడంతో విద్యుదాఘాతంతో మృతి చెంది ఉంటాడని గ్రామస్థులు అనుకున్నప్పటికీ పడిపోయిన స్థలంలో ఎలాంటి విద్యుత్ తీగలు లేకపోవడంతో రైతు మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతుడికి భార్య, ఒక కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించేందుకు కరీంనగర్‌కు తరలించారు. పోలీసులు దీనిపై లోతుగా దర్యాప్తు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. తండ్రి మృతిపై అనుమానాలున్నాయని కొమురయ్య కొడుకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.
















పంపకాలకు వేళాయే!

- ఢిల్లీలోని ఉమ్మడి ఆస్తుల విభజనకు ముందడుగు
- 19.781 ఎకరాలలో.. ఏపీకి 11.356, తెలంగాణకు 8.245 ఎకరాలు
- తెలంగాణ ప్రతిపాదనకు ఏపీ ఓకే



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో రెండు తెలుగు రాష్ట్రాలకు ఉమ్మడిగా ఉన్న ఆస్తుల విభజనలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఉమ్మడి(ఆంధ్రప్రదేశ్, తెలంగాణ)భవన్ విభజనకు మార్గం సుగమమైంది. మొత్తం 19.781 ఎకరాలలో ఉన్న ఉమ్మడి భవన్ ఆస్తులలో ఏపీకి 11,356 ఎకరాలు, తెలంగాణకు 8.245 ఎకరాలు కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు ఏపీ సర్కారు సుముఖత వ్యక్తం చేసింది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వ స్పందనను కేంద్ర హోంశాఖ బుధవారం తెలంగాణ ప్రభుత్వానికి తెలియజేసింది. తెలంగాణ సీఎం ఎ.రేవంత్ రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి చొరవతో గత నెలలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ భవన్ అధికారులతో కేంద్ర హోంశాఖ కీలక సమావేశం నిర్వహించింది. అనంతరం ఉమ్మడి ఆస్తుల విభజనపై తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. ఏపీ భవన్ కింద ఉన్న గోదావరి బ్లాక్ 4.315 ఎకరాలు, శబరి బ్లాక్‌తో పాటు అంతర్గత రహదారులు, దుకాణాలు(ఆక్రమణకు గురైన ప్రాంతం) ఉన్న 0.512 ఎకరాలు, నర్సింగ్ హాస్టల్ 3.359 ఎకరాలు, పటౌడీ హౌస్‌లో 2.396 ఎకరాలు ఏపీకి ఇచ్చేలా ప్రతిపాదన చేశారు. అదే విధంగా శబరి బ్లాక్ కింద ఉన్న 3 ఎకరాలు, పటౌడీ హౌస్‌లో ఉన్న 5.245 ఎకరాలు తమకు కేటాయించేలా తెలంగాణ ప్రతిపాదన చేసింది. అయితే తమకు ప్రతిపాదించిన అంతర్గత రహదారులు, దుకాణాలు(ఆక్రమణలు) ఉన్న ప్రాంతం(0.512 ఎకరాలు) విలువ దాదాపు రూ.250 కోట్లు అని, ఆ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోలేకపోతే అందుకు సరి సమానమైన భూమిని శబరి బ్లాక్ లేదా పటౌడీ హౌస్‌లోని భూమి నుంచి కేటాయించాలని ఏపీ షరతు విధించింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వ వివరణ కోరుతూ కేంద్ర హోంశాఖ బుధవారం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాసింది.

58:42 నిష్పత్తిలో పంపకాలు..

ఢిల్లీలోని ఉమ్మడి ఏపీ భవన్‌కు భూములు, భవనాలు సహా దాదాపు రూ.9,913.505 కోట్ల(దాదాపు పది వేల కోట్లు) విలువైన ఆస్తులు ఉన్నాయి. గోదావరి బ్లాక్, శబరి బ్లాక్, నర్సింగ్ హాస్టల్, పటౌడీ హౌస్ అనే విభాగాల కింద ఉమ్మడి భవన్ ఆస్తులు ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రానికి బయట ఉన్న ఆస్తులను రెండు తెలుగు రాష్ట్రాలు 58:42 నిష్పత్తిలో పంచుకోవాలని రాష్ట్ర పునర్విభజన చట్టంలో పొందుపరిచారు. కాగా, భవన్ పంపకాలలో ఏపీకి 58.32శాతం, తెలంగాణకు 41.68 శాతం ఆస్తులు రానున్నాయి. తెలంగాణ ప్రభుత్వం పటౌడీ హౌస్‌లోని 5.245 ఎకరాల్లో నూతన తెలంగాణభవన్ నిర్మించేందుకు సిద్ధమవుతోంది.



తమ సోదరుడి పాడె మోస్తున్న మల్లు భట్టి విక్రమార్క, రవి

సోదరుడికి కన్నీటి వీడ్కోలు పలికిన భట్టి

- పాడె మోసి నివాళులు

వైరా, ఫిబ్రవరి 14: అనారోగ్యంతో మృతిచెందిన విశ్రాంత ఆయుష్ అదనపు డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ మల్లు వెంకటేశ్వర్లు అంత్యక్రియలు బుధవారం ఆయన స్వగ్రామంలో అశ్రునయనాల మధ్య ముగిశాయి. డాక్టర్ వెంకటేశ్వర్లు సోదరులైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి డాక్టర్ మల్లు రవి ఆయన పాడె మోసి నివాళులర్పించారు. అంత్యక్రియలకు ముందు డాక్టర్ మల్లు వెంకటేశ్వర్లు భౌతికకాయాన్ని పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం అంతిమయాత్రతో ఆయన స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురానికి తీసుకువచ్చారు. గంటసేపు గ్రామస్థుల సందర్శనార్థం అక్కడ ఉంచారు. ఆ తర్వాత ఆయన వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించారు.

రాష్ట్రంలో భారీగా అధికారుల బదిలీలు

- మునిసిపల్ కమిషనర్లు, వ్యవసాయశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్లతో పాటు 95 మంది డీఎస్పీలకు స్థానచలనాలు
- జీహెచ్ఎంసీలో కమిషనర్ల బదిలీలు చర్చనీయాంశం

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో.. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అధికారుల బదిలీలు చేపట్టింది. ఈ మేరకు సంబంధిత శాఖలు బుధవారం ఉత్తర్వులు జారీ చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో విధులు నిర్వహిస్తున్న 114 మంది కమిషనర్లను బదిలీ చేస్తూ రాష్ట్ర మునిసిపల్‌శాఖ ఉత్తర్వులిచ్చింది. మంగళవారం 40 మంది కమిషనర్లను బదిలీ చేయగా బుధవారం మరో 74 మంది కమిషనర్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులిచ్చింది. ప్రధానంగా జీహెచ్ఎంసీ పరిధిలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న మునిసిపల్ కమిషనర్ల బదిలీ చర్చనీయాంశమైంది. గత ప్రభుత్వ పెద్దల అండదండలతో ఏళ్లుగా జీహెచ్ఎంసీ పరిధిలో తిష్టవేసిన పలువురు కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లకు స్థానచలనం కల్పించారు. అలాగే రాష్ట్ర వ్యవసాయశాఖలో పనిచేస్తున్న తొమ్మిది మంది అసిస్టెంట్ డైరెక్టర్లను బదిలీ చేస్తూ రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీచేశారు. మహబూబాబాద్ డీఏవోగా అభిమన్యు, భద్రాద్రి కొత్తగూడెం డీఏవోగా బి.బాబూరావు, సూర్యాపేట డీఏవోగా శ్రీధర్‌రెడ్డిని నియమించారు. పలు డివిజన్లకు ఏడీఏలను కూడా మార్చారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా సివిల్, తదితర విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న 95 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ రవిగుప్తా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం 110 మంది డీఎస్పీలు బదిలీ కాగా రెండో జాబితాలో మరో 95 మందిని బదిలీ చేశారు.

బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా రేపు సార్వత్రిక సమ్మె

బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలపై ఫిబ్రవరి 16న నిర్వహించనున్న కార్మిక సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఉద్యోగ, కార్మిక, రైతాంగ ప్రజావ్యతిరేక విధానాలను, కార్పొరేట్, మతోన్మాద రాజకీయాలను వ్యతిరేకిస్తూ కేంద్ర ట్రేడ్ యూనియన్ సంఘాలు, రైతుసంఘాల ఐక్యవేదిక సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) దేశవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిచ్చాయని పేర్కొన్నాయి. ఈ మేరకు వామపక్ష పార్టీల తరఫున సీపీఐ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఐఎంఎల్(ప్రజాపంథా) పోటు రంగారావు, సీపీఐఎంఎల్ (న్యూడెమోక్రసీ) చలపతిరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.



ప్రజాహిత యాత్రలో బండి సంజయ్

'కాళేశ్వరం' బాధ్యులను ఎందుకు అరెస్టు చెయ్యలే?

- ఎంపీ బండి సంజయ్

సిరిసిల్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర డ్యామ్ సేఫ్టీ అథారిటీ బృందం కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను సందర్శించి నివేదిక రూపొందించి చర్యలు తీసుకోవాలని కోరినా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ ఆరోపించారు. కాళేశ్వరం బాధ్యులను ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు. అంతేకాక, ఎన్నికల టికెట్ కోసం కన్నకొడుకు పేరునే మార్చేసిన ఘనుడు కేసీఆర్ అని విమర్శించారు. కేటీఆర్ అసలు పేరు కల్వకుంట్ల అజయ్‌రావు అని వెల్లడించారు. సిరిసిల్ల నియోజకవర్గంలోని గంభీరావుపేట, ముస్తాబాద్, తంగళ్లపల్లి మండలాల్లో బండి సంజయ్ బుధవారం ప్రజాహిత యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ తనకు టికెట్ ఇవ్వడం లేదని తెలుసుకున్న కేసీఆర్.. అజయ్‌రావును తీసుకెళ్లి మీ పేరే పెట్టుకున్నానని ఆయనకు చెప్పి టికెట్ తెచ్చుకున్న మోసగాడు కేసీఆర్ అని విమర్శించారు. అబద్ధాలు, మోసాల్లో కేటీఆర్ అయ్యను మించిపోయాడని ఎద్దేవా చేశారు. అయ్య(కేసీఆర్) ఏక్ నంబర్ అయితే కొడుకు(కేటీఆర్) దస్ నంబరని అన్నారు. తెలంగాణకు కేంద్రం పెద్ద ఎత్తున నిధులు ఇస్తోందని, రాజన్న సిరిసిల్ల జిల్లాకు రూ. 1,408 కోట్లు నిధులు ఇచ్చిందని తెలిపారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేస్తే రాముడికి ఓటు వేసినట్లేనని తెలిపారు. తెలంగాణ ప్రజల పక్షాన బీజేపీ కొట్లాడితే కాంగ్రెస్‌కు అధికారం ఇవ్వడం న్యాయమా? అని అడిగారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసే పరిస్థితి లేదని, ఎన్నికల కోడ్ నెపంతో ఆ పార్టీ నేతలు తప్పించుకునే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.

రాష్ట్రంలో 2 లక్షల మందికి 'ముఫ్త్ బిజిలీ'!

(మొదటి పేజీ తరువాయి)

తొలిదశలో భాగంగా 34,59,585 మందికి ఉచితంగా విద్యుత్‌ను అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఇదే సమయంలో ప్రధాని మోదీ ప్రకటించిన ముఫ్త్ బిజిలీ యోజన రాష్ట్రంలో సంపూర్ణంగా అమలయితే దాదాపు 2 లక్షల మందికి లబ్ధి చేకూరవచ్చని సంబంధిత అధికారవర్గాలు తెలిపాయి. ఈ మేరకు రాష్ట్రప్రభుత్వంపై గృహజ్యోతి భారం స్వల్పంగా తగ్గే అవకాశం ఉంది. మరోవైపు, ప్రతీ నెల 150 యూనిట్ల దాకా విద్యుత్ వినియోగించేవారికి 1-2 కిలోవాట్ల రూఫ్‌టాప్ సోలార్ యూనిట్ ఏర్పాటు చేసుకోవటానికి అవకాశం ఉంది. దీనికి రూ.1.10 లక్షలు వ్యయం కానుండగా... రూ.60 వేలు సబ్సిడీ లభిస్తుంది. మిగిలిన రూ.50 వేలు సొంతంగా పెట్టుకోవాలి. 150 యూనిట్ల విద్యుత్ వాడకానికి నెలకు రూ.700 దాకా బిల్లు వచ్చే అవకాశం ఉండగా... సోలార్ యూనిట్‌తో రూ.625 మేర ఆదా అవుతుందని, బిల్లు కేవలం రూ.75 మాత్రమే చెల్లించే పరిస్థితి ఉంటుందని తెలుస్తోంది. కేంద్ర పథకం కింద రూఫ్‌టాప్ (ఇంటి పైకప్పు మీద) సోలార్ యూనిట్లు పెట్టుకుంటే... వేసవిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల దాకా విద్యుత్తు ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంటుంది. ఈ విద్యుత్‌ను సొంతంగా వాడుకోవచ్చు లేదా డిస్కమ్‌లకు విక్రయించుకోవచ్చు. చీకటిపడ్డాక సౌరవిద్యుత్ ఉత్పత్తి ఆగిపోతుంది కాబట్టి ఆ సమయంలో బ్యాటరీలో నిల్వ చేసిన కరెంట్‌ను లేదా డిస్కమ్‌లు సరఫరా చేసే కరెంట్‌ను వాడుకోవాల్సి ఉంటుంది. కాగా, వినియోగదారుల నుంచి కొనుగోలు చేసే విద్యుత్ ధరను కేంద్రం ఖరారు చేయనుంది.

యూనిట్ల వినియోగం	సోలార్ ప్లాంట్	వ్యయం	కేంద్రం సబ్సిడీ	వినియోగదారుడు భరించాల్సింది
0-100	1 కిలోవాట్	రూ.60 వేలు	రూ.30 వేలు	రూ.30 వేలు
150	2 కిలోవాట్లు	రూ.1.10 లక్షలు	రూ.60 వేలు	రూ.50 వేలు
300	3 కిలోవాట్	రూ.1.65 లక్షలు	రూ.78 వేలు	రూ. 87 వేలు

ముఫ్త్ బిజ్లీ యోజన

ముఫ్త్ బిజ్లీ యోజనలో ఒక కిలోవాట్ సోలార్ ప్లాంట్‌కు రూ.30 వేలు, రెండు కిలోవాట్లకు రూ.60 వేలు, మూడు లేదా అంతకన్నా ఎక్కువ కిలోవాట్ సోలార్ ప్లాంట్లకు రూ.78 వేలు సబ్సిడీ లభిస్తుంది.

భారీగా పెరిగిన సబ్సిడీ

సోలార్ రూఫ్‌టాప్ పథకం ప్రారంభించిన కొత్తలో కేంద్రం 3 కిలోవాట్లదాకా 40 శాతం సబ్సిడీ ఇస్తుండేది. అయితే, క్రమేణా దీనిని తగ్గించుకుంటూ వచ్చారు. ప్రస్తుతం ప్రతి కిలోవాట్‌కు రూ.18 వేల చొప్పున 3 కిలోవాట్లకు రూ.54 వేలు సబ్సిడీ ఇస్తున్నారు. 3 కిలోవాట్ల నుంచి 10 కిలోవాట్ల దాకా కిలోవాట్‌కు రూ.9 వేల చొప్పున సబ్సిడీ ఇస్తున్నారు. ఇక అపార్టుమెంట్లు వంటి గ్రూప్ హౌసింగ్‌కు కిలోవాట్‌కు రూ.9 వేల దాకా సబ్సిడీ లభిస్తోంది. అయితే, ప్రస్తుతం ప్రకటించిన ముఫ్త్ బిజిలీ యోజనలో సబ్సిడీని భారీగా పెంచారు. ఈ పథకం కింద సోలార్ ప్లాంట్ ఏర్పాటు కోసం http://pmsuryaghar.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ప్రభుత్వ ఆమోదం లభించిన తర్వాత ఇంటి పైకప్పు మీద సోలార్ యూనిట్ పెట్టుకోవచ్చు. దక్షిణ డిస్కమ్ (ఎస్పీడీసీఎల్-హైదరాబాద్) పరిధిలో 80 మంది, ఉత్తర డిస్కమ్ (ఎన్పీడీసీఎల్-వరంగల్) పరిధిలో 82 మంది సోలార్‌ప్లాంట్ విక్రేతలు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌కు షాక్

కాంగ్రెస్‌లో చేరిన 36 మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు

కొత్తగూడెం టౌన్/వైరా/సూర్యాపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్‌కు భారీ షాక్ తగిలింది. కొత్తగూడెం, సూర్యాపేట మునిసిపాలిటీకి చెందిన కౌన్సిలర్లు పార్టీ ఫిరాయించారు. కొత్తగూడెం మునిసిపాలిటీలో బీఆర్‌ఎస్‌కు చెందిన ఓ కౌన్సిలర్‌తో పాటు పలువురు మహిళా కౌన్సిలర్ల భర్తలు, బంధువులు సుమారు 20 మంది కాంగ్రెస్‌లో చేరారు. వీరంతా బుధవారం ఖమ్మం జిల్లా వైరాలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన నాయకులకు ఏఐసీసీ పరిశీలకుడు రోహిత్‌చౌదరి కాంగ్రెస్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ నెల 19న కొత్తగూడెం చైర్‌పర్సన్ సీతాలక్ష్మిపై అవిశ్వాస తీర్మానం పెడుతున్న నేపథ్యంలో బీఆర్‌ఎస్‌కు చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరడం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, తదితరులు పాల్గొన్నారు. మరోవైపు, ఎన్నో హై డ్రామాల మధ్య సూర్యాపేట మునిసిపల్ చైర్‌పర్సన్ పదవిని బీఆర్‌ఎస్ నిలబెట్టుకున్నప్పటికీ బీఆర్‌ఎస్ అసమ్మతి కౌన్సిలర్లు మాత్రం చేజారిపోతున్నారు. మునిసిపల్ చైర్‌పర్సన్ పదవిని ఆశించిన 31వ వార్డు కౌన్సిలర్ కొండపల్లి నిఖిలను, ఆమె భర్త దిలీప్‌రెడ్డిని బీఆర్‌ఎస్ నుంచి సస్పెండ్ చేయడంతో 16 మంది అసమ్మతి కౌన్సిలర్లు బుధవారం మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

రెండు ఇళ్లలో చోరీ

● 50 వేల నగదు, వెండి వస్తువులు అపహరణ

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 14: సిరిసిల్ల పట్టణంలోని శ్రీనగర్ కాలనీలోని మార్తనపేట్ మాజీ సర్పంచ్ వంశీ ఇంట్లో రెండవ అంతస్తులో అద్దెకు ఉంటున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ సంపత్ ఇంట్లో మంగళవారం చోరీ జరిగింది. జిల్లెల్ల వ్యవసాయ కళాశాలలో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ సంపత్ ఇంటికి తాళం వేసి శుభకార్యంలో పాల్గొనేందుకు హైదరాబాద్ వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు తాళం పగులగొట్టి లోనికి చొరబడి ఇంట్లో ఉన్న 50 వేల నగదు, విలువైన వెండి చెంబు, రెండు పల్లాలు, ఒక దేవుడి చిన్న విగ్రహాన్ని ఎత్తుకెళ్లారు. ఇంతటితో ఆగకుండా అదే అంతస్తులో అద్దెకు ఉంటున్న మరో ఇంటి తాళం పగులగొట్టి లోనికి చొరబడినప్పటికీ దొంగలకు ఏమీ దొరకలేదు. ఆ తర్వాత మరో ఇంట్లో చోరీకి యత్నించి విఫలమై చివరికి పక్కింటి బానోతు గోపికి చెందిన ద్విచక్ర వాహనాన్ని దొంగిలించి దానిపై ముగ్గురు దొంగలు పరారయ్యారు. అయితే అదే భవనంలోని మొదటి అంతస్తులో సిరిసిల్ల డీఎస్పీ అద్దెకు ఉంటున్నారు. అయినప్పటికీ దొంగలు ప్రవేశించడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఈ సంఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సంఘటన స్థలాన్ని పరిశీలించినట్లు టౌన్‌సీఐ రఘుపతి తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది మహిళ ఆత్మహత్య

మల్యాల, ఫిబ్రవరి 14 :మల్యాల మండలం తాటిపల్లి గ్రామానికి చెందిన అమ్ముల సుజాత (56) అనే మహిళ జీవితంపై విరక్తిచెంది ఉరివేసుకొని బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డట్లు మల్యాల ఎస్సై తెలిపారు. సుజాత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో బాత్‌రూమ్‌లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిందని ఎస్సై రహీం తెలిపారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



యుగంధర్

ఫైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 14: అల్లూరు గ్రామానికి చెందిన కొయ్యడ యుగంధర్ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు గోదావరిఖని టూటౌన్ సీఐ ప్రసాదరావు తెలిపారు. యుగంధర్ ఈ నెల 13వ తేదీ తెల్లవారు జామున అల్లూరులోని ఇంట్లో నుంచి కనిపించకుండా పోయినట్టు సీఐ తెలిపారు. కుటుంబ సభ్యులు వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదని, యుగంధర్ తండ్రి కొయ్యడ రాజమౌళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ పేర్కొన్నారు. యుగంధర్ ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని సీఐ పేర్కొన్నారు.

గంజాయి విక్రయదారుల రిమాండ్

మానకొండూర్, ఫిబ్రవరి 14 : మానకొండూర్‌లో ముగ్గురు గంజాయి విక్రయదారులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని చెరువుకట్ట బస్టాండ్ వద్ద మంగళవారం రాత్రి వాహనాల తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని జగ్గయ్యపల్లి గ్రామానికి చెందిన వ్యాట అనిల్‌రెడ్డి, మానకొండూర్‌కు చెందిన షేక్ ఇస్మాయిల్, లింగాపూర్‌కు చెందిన ఏకుల భరత్ అనే ముగ్గురు మోటారు సైకిల్‌పై వెళ్తుండగా తనిఖీ చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీలో వారి వద్ద నుంచి కిలో 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని బుధవారం ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు.

అనుమానాస్పదంగా నాటుకోళ్లు మృతి

చిగురుమామిడి, ఫిబ్రవరి 14: మండలంలోని బొమ్మనపల్లి గ్రామానికి చెందిన వీరమల్ల లత అనే మహిళా రైతుకు చెందిన 130 నాటు కోళ్ల మృత్యువాత పడ్డాయని స్థానిక ఎస్సై బండి రాజేశ్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సదరు మహిళ తన వ్యవసాయ బావివద్ద వ్యవసాయంతో పాటు నాటు కోళ్ల ఫామ్ ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తోంది. బుధవారం ఉదయం వెళ్లి చూసే సరికి 130 నాటుకోళ్ల 13o నాటు కోళ్ల మృతి చెందినట్లు, తనకు అనేక అనుమానాలు ఉన్నాయని బాధితురాలు లత ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాళేశ్వరం అవినీతిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు

గంభీరావుపేట, ఫిబ్రవరి 14: కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయే ప్రమాదం ఉందని తెలిసి కూడా చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ ప్రశ్నించారు. గంభీరావుపేట మండల కేంద్రంతో పాటు లింగన్నపేట, కొత్తపల్లి గ్రామాల్లో బుధవారం బండి సంజయ్ ప్రజాహిత యాత్ర కొనసాగింది. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సభలో బండి సంజయ్ మాట్లాడుతూ కేంద్ర డ్యాం సేఫ్టీ అథారిటీ బృందం అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించిందన్నారు. పనులపై నివేదిక రూపొందించి చర్యలు తీసుకోవాలని కోరిన రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా లక్ష కోట్ల ప్రజాధనాన్ని వృథా చేసిన అప్పటి సీఎం కేసీఆర్ సహా బాధ్యులైన బీఆర్‌ఎస్ నేతలను ఎందుకు అరెస్ట్ చేయడం లేదన్నారు. కాళేశ్వరంపై కేంద్ర, రాష్ట్ర ఇంజనీరింగ్ నిపుణుల బృందం నివేదిక ఇచ్చిందని, విజిలెన్స్ సైతం రిపోర్ట్ ఇచ్చిన తరువాత మళ్లీ అక్కడికి వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. దేశ వ్యాప్తంగా బీజేపీ గెలుపు ఖాయమని తేలడంతో ప్రజల దృష్టి మళ్లించటానికి కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు కాళేశ్వరం, కృష్ణా నీటి పంపకాల పేరుతో డ్రామాలు ఆడుతున్నాయని అన్నారు. కాళేశ్వరంపై సీబీఐ విచారణ జరిపిస్తామని మాట ఎందుకు తప్పుతున్నారో ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కమలం గుర్తుకు ఓటువేస్తే రాముడికి ఓటేసినట్టేనని, మన కల నెరవేర్చిన మోదీని మళ్లీ ప్రధానిని చేద్దామని బండి సంజయ్ అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసే పరిస్థితిలో లేదన్నారు. అంతకు ముందు గంభీరావుపేట మండల కేంద్రంలోని పురాతన రామాలయంలో ఎంపీ బండి సంజయ్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకురాలు రాణిరుద్రమ, మండల బీజేపీ అధ్యక్షుడు గంట అశోక్, జిల్లా నాయకులు కొక్కు దేవేందర్‌యాదవ్, ఎంపీటీసీ రాజేందర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధులు దెవసాని కృష్ణ, ప్రసాద్‌రెడ్డి, పత్తి స్వామిరాజు ఉన్నారు.



గంభీరావుపేటలో ప్రజాహిత యాత్రలో మాట్లాడుతున్న బండి సంజయ్

500 కోట్ల భూదాన్ భూములు కబ్జా

గంభీరావుపేట : ఓ అపర మేధావి నాపై ఏది పడితే అది మాట్లాడుతున్నాడని నన్ను గెలికితే నేను ఇంకా ఎక్కువ గెలుకుతానంటూ ఓ బీఆర్‌ఎస్ నేతపై ఎంపీ బండి సంజయ్ ఘాటు విమర్శలు చేశారు. గచ్చిబౌలిలో రూ.500 కోట్ల విలువ చేసే భూదాన్ భూములు కబ్జా చేసిన విషయం తనకు తెలుసన్నారు. బోయినపల్లి మండలం నర్సింగాపూర్‌లో 20 ఎకరాల భూమి వ్యవహారం, లోటస్ పాండ్ సమీపంలో అధికారులను పిలుపించుకుని నవ్వు ఏమేమి చేస్తున్నావో అంతా తెలుసని అన్నారు. తాను ఎలాంటి అక్రమ దందాలు చేయలేదన్నారు.

ఏసీపీ, సీఐల బదిలీలు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 14: కరీంనగర్ పీటీసీలో డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న జి మహేష్‌బాబును రెండు రోజుల కిందటే రామగుండం ఏసీపీగా బదిలీ చేయగా బుధవారం ఆ పోస్టింగ్‌ను రద్దు చేసి రాజన్న సిరిసిల్ల జిల్లా స్పెషల్‌బ్రాంచి డీఎస్పీగా నియామకం చేస్తూ బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. అలాగే కరీంనగర్ సీసీఎస్ ఏసీపీ వి మాధవిని రెండు రోజుల కిందట రామగుండం సీసీఆర్‌బీ ఏసీపీగా బదిలీ చేయగా తాజాగా ఆ బదిలీని రద్దు చేసి తిరిగి కరీంనగర్ సీసీఎస్ ఏసీపీగా నియామకం చేశారు. అలాగే కరీంనగర్ పీటీసీ డీఎస్పీ జి మధును సిద్దిపేట ఏసీపీగా బదిలీ చేశారు.

● జమ్మికుంట సీఐగా వి రవి నియామకమయ్యారు. జమ్మికుంట సీఐగా పనిచేసిన రమేష్‌ను ఇటీవలనే బదిలీ చేయగా అతని స్థానంలో ప్రస్తుం గోదావరిఖని ట్రాఫిక్ సీఐగా విధులు నిర్వహిస్తున్న వరగంటి రవిని బదిలీ చేస్తూ మల్టీజోన్-2 ఐజీ బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. అలాగే కరీంనగర్ సీసీఎస్ సీఐగా పనిచేస్తున్న నంద లింగమూర్తిని గోదావరిఖని-2 టౌన్ సీఐగా బదిలీ చేశారు.

మేడిగడ్డ రావడానికి ముఖం చాటేసిన కేసీఆర్



మాట్లాడుతున్న గజ్జెల కాంతం

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 14: మేడిగడ్డ ప్రాజెక్టుకు వచ్చేందుకు కేసీఆర్‌కు ముఖం లేకనే నల్గొండలో సభపెట్టుకున్నారని, ఆయనకు పుట్టుకతోనే అబద్ధాలు ఆడడం అలవాటు అని తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గజ్జెలకాంతం ఆరోపించారు. బుధవారం డీసీసీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేసీఆర్ స్కాములు చేయడం కోసం స్కీములు పెట్టాడన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు 35 వేల కోట్ల రూపాయల వ్యయం అయితే, దానిని లక్ష 30 వేల కోట్ల రూపాయలకు పెంచి దోచుకుతిన్నారని ఆరోపించారు. కేసీఆర్ అసెంబ్లీకి ఎందుకు రావడం లేదో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈనెల 17 తేదీన హైదరాబాద్‌లోని సెంటర్ కోర్టులో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశామని, నిజమైన ఉద్యమకారుడు అయితే కేసీఆర్ ఈ సమావేశానికి హాజరు కావాలన్నారు. కేసీఆర్ తన కుటుంబ పాలన కోసం పార్టీ పెట్టి, తెలంగాణ ప్రజలను మభ్యపెట్టి సెంటిమెంటును వాడుకున్నాడన్నారు. తెలంగాణ కోసం కేసీఆర్ దొంగ దీక్షను నిజమని నమ్మి శ్రీకాంతచారితో పాటు వందల మంది ఆత్మహత్య చేసుకున్నారన్నారు. విలేకరుల సమావేశంలో నాయకులు సముద్రాల అజయ్, గజ్జల ఆనంద్‌రావు, కొంద్ర సంపత్ పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీల రద్దు

● పర్సన్ ఇన్‌చార్జిలుగా అధికారులు

వరంగల్‌టౌన్, ఫిబ్రవరి 14: రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాలను రద్దు చేస్తూ మంగళవారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మార్కెటింగ్‌శాఖ వరంగల్ రీజియన్ పరిధిలోని 110 వ్యవసాయ మార్కెట్లకు 48 మార్కెట్ల పాలకవర్గాలు రద్దయ్యాయి. ఇక మిగి లిన పాలకవర్గాలకు గతంతో సమయం ముగిసిపోయింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 198 వ్యవసాయ మార్కెట్ కమిటీలకు కొత్త పాలకవర్గాలను నియమించేందుకు మార్గం సుగమం కాగా.. ఆ మేరకు మంత్రులు, ఎమ్మెల్యేలు సన్నాహాలు చేసుకోవాలని ఇప్పటికే ముఖ్యమంత్రి ప్రకటించిన విష యం తెలిసిందే. అలాగే పాలకవర్గాలు రద్దు కావడంతో పాలనపరమైన ఇబ్బందులు తలెత్తకుండా మార్కెటింగ్‌శాఖ అధికారులను పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా నియమించారు. సెలక్షన్ గ్రేడ్ మార్కెట్ కమిటీలకు జేడీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా, స్పెషల్ గ్రేడ్ మార్కెట్ కమిటీలకు డీడీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా అంతకంటే దిగువస్థాయి మార్కెట్ కమిటీలకు డీఎంవోలు పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా ప్రభుత్వం నియమించింది.

ఉమ్మడి జిల్లాలో రద్దయిన మార్కెట్ కమిటీలు ఇవే..

కరీంనగర్ జిల్లాలోని చొప్పదండి, గంగాధర, గోపాల్‌రావుపేట కమిటీలు, సిరిసిల్ల జిల్లాలోని పోత్గల్, గంభీరావుపేట్, రాచర్ల బొప్పాపూర్, రుద్రంగి, ఇల్లంతకుంట, బోయిన్‌పల్లి, వీర్నపల్లి మార్కెట్ కమిటీలున్నాయి. అలాగే జగిత్యాల జిల్లాలో పెగడపల్లి, వెల్గటూర్, రాయ్‌కల్, గొల్లపల్లి, ధర్మపురి, మల్యాల, కథలాపూర్,మేడిపల్లి మార్కెట్ కమిటీలు, పెద్దపల్లి జిల్లాలోని కమాన్‌పూర్, సుల్తానాబాద్, ధర్మారం, మంథని మార్కెట్ కమిటీలు రద్దయిన వాటిలో ఉన్నాయి.

కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉన్న దగ్గర మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలను ఏర్పాటు చేసుకునేందుకు నేరుగా ప్రతిపాదనలు పంపిస్తారు. ఇతర పార్టీ ఎమ్మెల్యేలున్న చోట జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ప్రతిపాదనలు పంపించే అవకాశం ఉంది.

ఎంబీఏ, ఎంసీఏ పరీక్షల షెడ్యూల్ విడుదల

గణేశ్‌నగర్, ఫిబ్రవరి14: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించనున్న ఎంబీఏ, ఎంసీఏ, మొదటి సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు ఈనెల 26 నుంచి మార్చి5 వరకు జరగనున్నట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్‌వి శ్రీరంగప్రసాద్ తెలిపారు. పరీక్షలు మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, ఫిబ్రవరి14: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నవంబర్ 2023న నిర్వహించిన హోటల్ మేనేజ్‌మెంట్ 1,3,5వ సెమిస్టర్ ఫలితాలను పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్వి శ్రీరంగప్రసాద్, విడుదల చేశారు. ఫలితాలను యూనివర్సిటీ వెబ్‌సైట్www.satavahana.ac.in,http://లోఅందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

బీఎస్సీ మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, ఫిబ్రవరి14: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జనవరి 2024 నిర్వహించిన బీఎస్సి(ఆనర్స్) (కంప్యూటర్ సైన్స్) ఒకటో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను బుధవారం విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్వి శ్రీరంగప్రసాద్ తెలిపారు. ఫలితాలనుwww.satavahana.ac.inaలో అందుబాటులో ఉంచినట్లు ఆయన తెలిపారు.

నేడు జేఎల్ఎం అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

గణేశ్‌నగర్, ఫిబ్రవరి14: జూనియర్ లైన్‌మెన్ సర్టిఫికెట్ల పరిశీలన, స్తంభం ఎక్కించే పరీక్షలను టీఎస్ఎన్‌పీడీసీఎల్, కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో గురువారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ తెలిపారు. అభ్యర్థుల చిరునామాలకు పోస్ట్ ద్వారా కాల్‌లెటర్లు పంపించామన్నారు. అందనివారు కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో కాల్‌లెటర్ పొందవచ్చన్నారు. జేఎల్ఎం నియామక కమిటీ ద్వారా అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన, పోలు ఎక్కించడం పరీక్షలను పారదర్శకంగా నిర్వహిస్తామని ఎస్ఈ తెలిపారు.

బాలింత మృతి.. బంధువుల ఆందోళన

జమ్మికుంట, ఫిబ్రవరి 14: జమ్మికుంట పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో శిశువుకు జన్మనిచ్చిన అనంతరం ఓ బాలింత చికిత్స పొందుతూ మృత్యువాత పడింది. వైద్యుల నిర్లక్ష్యం వల్లే మృతి చెందిందని ఆరోపిస్తూ మృతదేహంతో బంధువులు ఆసుపత్రి ఎదుట బుధవారం ధర్నా, రాస్తారోకో చేపట్టారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం తొగరాయి గ్రామానికి చెందిన జుంగోని మానస (24) రెండవ కాన్పు కోసం తల్లిగారి గ్రామం అయిన వీణవంక మండలం శ్రీరాములపేటకు వచ్చింది. ఈ నెల 12న జమ్మికుంట పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి ప్రసవం కోసం భర్త శ్రీకాంత్‌తో కలిసి వెళ్లింది. మరుసటి రోజు ఆపరేషన్ చేయగా, మగ శిశువుకు జన్మినిచ్చి అపస్మారక స్థితిలోకి చేరుకుంది. కొద్ది గంటల తర్వాత ఆరోగ్యం విషమించిందని, మెరుగైన చికిత్స నిమిత్తం ఇతర ఆసుపత్రికి తీసుకు వెళ్లాలని వైద్యులు సూచించారు. దీంతో హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకు వెళ్లగా, అక్కడి వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృత్యువాత పడింది. పోలీస్‌లు సంఘటన స్థలానికి చేరుకుని వారిని శాంతింపచేశారు. మృతురాలికి భర్త శ్రీకాంత్, రెండేళ్ల కుమారుడు, మగ శిశువు ఉన్నారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్‌లు తెలిపారు.

పూల్వామా అమర జవానులకు నివాళి

ధర్మారం, ఫిబ్రవరి 14: మండలంలోని బొమ్మారెడ్డిపల్లిలో బుధవారం సాయంత్రం పూల్వామా అమరుల దినోత్సవాన్ని జరిపారు. పూల్వామా జిల్లాలో ఉగ్రవాదుల దాడిలో అమరులైన అమర జవానులకు గ్రామంలో పోలీసులు, యువకులు, గ్రామస్థులు కొవ్వొత్తులతో ఘన నివాళులర్పించారు. ఎస్సై సత్యనారాయణ, కాంగ్రెస్ అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, యువకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

మంథని, ఫిబ్రవరి 14: మంథని మున్సిపల్ పరిధిలోని కూచిరాజుపల్లి వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తికి బుధవారం తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు కథనం ప్రకారం.. బూడిద సమ్మయ్య(45) అనే వ్యక్తి రాత్రి సమయంలో కూచిరాజుపల్లిలోని తన నివాసం వద్ద నుంచి మంథని-పెద్దపల్లి ప్రధాన రహదారి దాటుతున్న సమయంలో గుర్తుతెలియని వాహనం బలంగా ఢీకొట్టింది. దీంతో సమ్మయ్య తలకు తీవ్ర గాయమైంది. గమనించిన స్థానికులు 108కు సమాచారం ఇచ్చారు. దీంతో సిబ్బంది మంథని ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం కరీంనగర్‌కు తరలించారు. కాగా సమ్మయ్య పరిస్థితి విషమంగా ఉంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించినట్టు సమాచారం.

అయ్యప్పస్వామిని దర్శించుకున్న మాజీ మంత్రి

ధర్మారం, ఫిబ్రవరి 14: కేరళ రాష్ట్రంలోని శబరిమలైలో హరిహరసుత అయ్యప్పస్వామిని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ బుధవారం దర్శించుకున్నారు. ఆలయంలో ఆయన పూజలు చేశారు. ఆయన వెంట ట్రస్మా రాష్ట్ర సెక్రటరీ యాదగిరి శేఖర్‌రావు, వెల్గటూర్ మార్కెట్ మాజీ చైర్మన్ ఎలేటి కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవోలు


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపీడీవోలు శైలజా రాణి, భాస్కర్‌రావు, పద్మజ, ప్రవీణ్‌కుమార్

ఓదెల, ఫిబ్రవరి 14: ఓదెల మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా జి తిరుపతిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జగిత్యాల జిల్లా బుగ్గారం ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న తిరుపతి బుధవారం ఓదెల మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు ఎంపీపీ రేణుకాదేవి, ఎంపీవో వాజీద్, సిబ్బంది సన్మానించి స్వాగతం పలికారు.

ధర్మారం: ధర్మారం ఎంపీడీవోగా ఐ. ప్రవీణ్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా అధికారుల బదిలీల ప్రక్రియలో భాగంగా ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో బీ జయశీలను రాజన్న సిరిసిల్ల జిల్లాకు బదిలీ చేశారు. ఆమె స్థానంలో జగిత్యాల జిల్లా నుంచి ఐ. ప్రవీణ్‌కుమార్‌ను ధర్మారం ఎంపీడీవోగా నియమించారు. ఈ మేరకు బుధవారం మధ్యాహ్నం ఆయన ఎంపీడీవో కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు.

రామగిరి: మండల ప్రజాపరిషత్ నూతన ఎంపీడీవోగా శైలజా రాణి పదవి బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవోగా పనిచేసిన రమేశ్ సస్పెన్షన్ వేటు పడగా ఆయన స్థానంలో శైలజారాణికి ఎంపీడీవోగా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ నియమాకపు ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు బుధవారం శైలజారాణి పదవి బాధ్యతలు స్వీకరించగా ఎంపీపీ ఆరెల్లిదేవక్క స్వీటు తినిపించి ఆహ్వానించారు.

ముత్తారం: ముత్తారం ఎంపీడీవోగా లలిత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పాలకుర్తి మండలంలో ఎంపీడీవో విధులు నిర్వహించ లలిత బదిలీపై ముత్తారం వచ్చారు. ఇక్కడ పనిచేసిన కలికోట శ్రీనివాస్ సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలానికి బదిలీపై వెళ్లారు.

సుల్తానాబాద్: సుల్తానాబాద్ నూతన ఎంపీడీఓ గా బదిలీ పై వచ్చిన నీలగిరి దివ్య దర్శన్ రావు గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంను పురస్కరించుకుని ఎంపీపీ బాలాజీ రావు,ఎంపీటీసీ సభ్యులు, మండల పరిషత్ ఉద్యోగులు సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ పని చేసిన ఎంపీడీవో శశికళ రాజన్న సిరిసిల్ల జిల్లాలోని కోనరావుపేట మండలంకు బదిలీ ఆయ్యారు.

ఇటీవల కొత్తగా బదిలీపై వచ్చిన మున్సిపల్ కమిషనర్ వేణుమాధవ్ బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. అంతకుముందు ఉన్న మల్లికార్జున్ హుస్నాబాద్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో కొత్తపల్లిలో కమిషనర్‌గా పనిచేసిన వేణుమాధవ్ సుల్తానాబాద్‌కు వచ్చారు. వేణుమాధవ్‌కు ఉద్యోగులు సిబ్బంది, కౌన్సిలర్లు శుభాకాంక్షలు తెలిపారు.

జూలపల్లి: జూలపల్లి మండలపరిషత్ అభివృద్ధి అదికారిగా పద్మజా బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. కొడిమ్యాల ఎంపీడీవోగా పనిచేసిన పద్మజా జూలపల్లికి బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేసిన వేణుగోపాల్‌రావును చొప్పదండికి బదిలీ చేశారు.

అనంతరం ఎంపీడీవో పద్మజ స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. గ్రామ అభివృద్ధికి, ప్రజాసమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు, ఉపాధిహామీ పథకంలో కూలీలకు కల్పిస్తున్నా పనులు, తదితర అంశాలపై పంచాయతీ కార్యదర్శి అనంతుల లచ్చయ్యను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోను కార్యాలయ సిబ్బంది, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో సదానందం, పంచాయతీ కార్యదర్శులు శరత్, రవీందర్, పున్నమయ్య, లచ్చయ్య, సంతోష్, టీఏ శ్రీకర్, పలువురు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎలిగేడు: ఎలిగేడు మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారిగా యాదగిరి భాస్కర్‌రావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు మండల ప్రజా పరిషత్ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛం అదంచి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దని ప్రజలకు జవాబుదారీగా ఉండి పనిచేసి సహకరించాలని సూచించారు.

'రసాయనిక ఎరువులను అధికంగా వాడొద్దు'


ఎరువుల దుకాణంలో మందులను పరిశీలిస్తున్న ఏవో ప్రమోద్‌కుమార్

కమాన్‌పూర్, ఫిబ్రవరి 14 : రైతులు రసాయన ఎరువులను మోతాదుకు మించి వాడొద్దని మండల వ్యవసాయాధికారి బండి ప్రమోద్‌కుమార్ అన్నారు. మండలంలోని జూలపల్లి గ్రామంలో క్షేత్ర స్థాయిలో బుధవారం పర్యటించి రైతులకు పంటల సాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. యూరియా ఎరువులను అధికంగా వాడితే భూసారం తగ్గి పంట దిగుబడికి నష్టం వాటిల్లుతుందని వివరించారు. ఈ క్షేత్ర స్థాయి సందర్శనలో ఏఈవో అజ్మీరా సురేష్ నాయక్ ఉన్నారు.

హాస్టల్ నుంచి నలుగురు మెడికల్ విద్యార్థుల సస్పెన్షన్

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 14: రామగుండం మెడికల్ కళాశాలలో మంగళవారం ర్యాగింగ్‌కు పాల్పడిన నలుగురు విద్యార్థులను కళాశాలలోని హాస్టల్ నుంచి సస్పెండ్ చేశారు. ఏడుగురు సభ్యులతో ఒక కమిటీని నియమించి నిజ నిర్ధారణ చేయనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు ఒక ప్రటనలో తెలిపారు.

కరాటేలో ఖని విద్యార్థుల ప్రతిభ

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 14: ఇటీవల వరంగల్ జిల్లా నర్సంపేట్‌లో జరిగిన జాతీయస్థాయి కరాటే చాంపియన్‌షిప్-2024లో షోటోకాన్ జపాన్ కరాటేడు ఇండియా హంబో టోర్నమెంట్‌లో గోదావరిఖని జపాన్ షిటోరియో కరాటే స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనపర్చి పతకాలు సాధించారు. కటాస్, కుమితి విభాగాలలో విద్యార్థులు ప్రతిభ కనపర్చి బంగారు, వెండి, కాంస్య పతకాలను సినీనటులు, కరాటే మాస్టర్ సుమన్ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. బ్లాక్‌బెల్ట్ విభాగం కటాస్, కుమితిలో ఎం.ముక్తిశ్రీ(వెండి), కలర్ బెల్ట్ కటాస్ విభాగంలో ఎం.కార్తికేయన్, ఎం.మనస్విని, టి.పవన్‌కుమార్(బంగారు పతకాలు సాధించారు. సిహెచ్ అశ్విన్, ధ్రువన్ కాంస్య పతకాలు, విగ్నేష్(వెండి) పతకాలు, కలర్ బెల్ట్ కుమితి విభాగంలో ఎం.కార్తికేయన్, ఎం. మనస్విని(వెండి), పి ధ్రువ విగ్నేష్ బంగారు పతకాలు, విబోర్ వెండి పతకం సాధించారు. విద్యార్థులను, కోచ్ కరాటే శ్రీనివాస్‌ను జపాన్ షిటోరియో కరాటే స్కూల్ ప్రెసిడెంట్ తగరపు శంకర్, సెక్రెటరీ ఎం.రమేష్, సీనియర్ ఇన్‌స్పెక్టర్స్ ఎస్ శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, నిదిష్‌కుమార్, రోహిత్‌కుమార్, సంజన, శుభశ్రీ, అభిజ్ఞ, స్పందన క్లబ్ సెక్రటరీ త్రివేది, స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రెటరీ బాణేష్‌రావు అభినందించారు.

'కరాటేతో ఆత్మరక్షణ'

సుల్తానాబాద్, ఫిబ్రవరి 14: కరాటేతో ఆత్మరక్షణ చేసుకోవచ్చని సెయింట్ మేరీస్ హైస్కూల్ కరస్పాండెంట్ తుమ్మ జోసెఫ్ అశోక్ అన్నారు. కరీంనగర్‌లో జరిగిన ఓకినోవా ఇనిస్టిట్యూట్ వారి ఆధ్వర్యంలో తెలంగాణ ఇంటర్ స్టేట్ కరాటే-2024 చాంపియన్‌షిప్ పోటీల్లో సెయింట్ మేరీస్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు విజేతలుగా నిలిచి ప్రశంసాపత్రాలు పొందారు. బుధవారం విద్యార్థులను ఆయన అభినందించారు. విజేతల్లో శశికావ్య, ప్రవష్తి, వర్షిణి, మెర్సీ, మనీషా, అక్షర, ఆకిరానందన్ ఉన్నారు. వీరందరూ రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనే అర్హత సాధించారన్నారు.

కేంద్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది ఎన్‌డీఏ ప్రభుత్వమే

- పెద్దపల్లి పార్లమెంట్ ప్రభారి కొప్పు బాషా


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కొప్పు బాషా

పెద్దపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలో మరోసారి ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని, అందులో బీజేపీ మెజారిటీ సీట్లు సాధిస్తుందని పెద్దపల్లి పార్లమెంట్ ప్రభారి కొప్పు బాషా ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం పెద్దపల్లిలో ఏర్పాటు చేసిన పెద్దపల్లి బీజేపీ పార్లమెంట్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా నరేంద్ర మోదీ ప్రధానిగా అవినీతిరహిత పాలనను బీజేపీ అందిస్తున్నదని అన్నారు. ఈ పదేళ్లలో ప్రపంచ దేశాల్లో భారత్‌ను మోదీ శక్తివంతమైన దేశంగా నిలిపారని అన్నారు. అన్నిదేశాలు భారత్ వైపు చూస్తున్నాయని అన్నారు. వికసిత్ భారత్‌గా అభివృద్ధి చెందుతున్నదని అన్నారు. బీజేపీ ప్రభుత్వంపై ప్రజలకు ఎనలేని విశ్వాసం ఉందని, భారతదేశానికి బీజేపీ వల్లనే రక్షణ ఉంటుందనే అభిప్రాయాన్ని ప్రజలు కలిగి ఉన్నారని అన్నారు. కేంద్రంలో మరోసారి ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి రానున్నదని అన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ స్థానం గెలిచేందుకు అవకాశాలు చాలా ఉన్నాయన్నారు. పార్టీకి చెందిన నాయకులు సమన్వయంతో ముందుకు వెళితే ఇక్కడ కూడా గెలుస్తామన్నారు. పార్టీ ఎవరికి టికెట్ ఇచ్చినా వారి గెలుపు కోసం ప్రతీనాయకుడు, కార్యకర్త సైనికుడి వలే కృషి చేయాలని కొప్పు బాషా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ బీజేపీ దళిత మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్, జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు ఎరవెల్లి రఘునందన్‌రావు, రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శిలారపు పర్వతాలు, పార్టీ నాయకులు వెంకటేశ్ గౌడ్, గుండవేన లక్ష్మన్ యాదవ్, వెన్నంపల్లి శ్రీనివాస్, పల్లె సదానందం, తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 14: పట్టణంలోని కునారం రైల్వే గేటు సమీపంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు. మృతుడి ఆచూకీకి సంబంధించి ఎలాంటి వివరాలు లభించలేదని, తెలుపురంగు షర్టు, బ్లూకలర్ జీన్ ప్యాంట్ వేసుకున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని గోదావరిఖని ప్రభుత్వాస్పత్రి మార్చురీలో ఉంచినట్లు తెలిపారు. వివరాలకు 9949304574 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మోడల్ స్కూల్ విద్యార్థినికి ఇన్‌స్పైర్ అవార్డ్

సుల్తానాబాద్, ఫిబ్రవరి 14: సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి ప్రభుత్వ మోడల్ స్కూల్ విద్యార్థిని చెలుకల సంజన ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికైందని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రఘునాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ వారు ఈ మేరకు సంజన ఎంపికయినట్టు ప్రకటించారని తెలిపారు.

ఓసీపీలో ప్రమాదం

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 14: శ్రీరాంపూర్ ఓసీపీలో బుధ వారం ఉదయం జరిగినప్రమాదంలో ఓ కాంట్రాక్ట్ డ్రైవర్ గాయపడ్డారు. ఓబీ తొలగించే ప్రైవేటుకంపెనీలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న మొగిలి శ్రీకాంత్ వేకువ జామున వోల్వో వాహనం నడుపుతూ వెళ్తుండగా, ఆగి ఉన్న మరో వోల్వో వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో శ్రీకాంత్ కుడికాలు తెగిపడింది. వెంటనే అతన్ని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

అంగన్‌వాడీ విద్యార్థులకు ఆట వస్తువులు పంపిణీ


పిల్లలకు ఆట వస్తువులు అందజేస్తున్న నాయకులు

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 14: రామగుండం కార్పొరేషన్ 40వ డివిజన్‌లోని అంగన్‌వాడీ సెంటర్‌లో విద్యార్థులకు బుధవారం కాంగ్రెస్ నాయకులు మిడిదొడ్డి ప్రవీణ్ ఆధ్వర్యంలో పిల్లలకు ఆట వస్తువులు పంపిణీ చేశారు. కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ మహంకాళి స్వామి జన్మదినం సందర్భంగా విద్యార్థులకు ఆట వస్తువులను అందజేశారు. ఎన్‌టీపీసీలోని సాయిసేవా సమితి ఆధ్వర్యంలో రెబల్ స్టార్ ప్రభాస్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో పిల్లలకు అన్నదానం, పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కుడిదెల శివ, మినేష్, సురేష్, సాయి, హేమంత్, రాజు, అంగన్‌వాడీ టీచర్ బండారి సునీత, ఆయ రాజేశ్వరి పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన జిల్లా పంచాయతీ అధికారి


ఆర్ఏఎస్‌పీ లత

పెద్దపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు బదిలీపై వచ్చిన జిల్లా పంచాయతీ అధికారి ఆర్ఏఎస్‌పీ లత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌కు వచ్చిన ఆమె మొదట కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీని మర్యాద పూర్వకంగా కలుసుకుని కార్యాలయానికి వెళ్లారు. అక్కడ కార్యాలయ సిబ్బంది ఆమెకు స్వాగతం పలికారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పంచాయతీల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరిగేలా, తాగు నీటి సరఫరా, వీధి దీపాల ఏర్పాటు, తదితర అన్ని రకాల పనులు చేపడతామని డీపీఓ తెలిపారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

రామగుండం ఎంవీఐ భీమ్‌సింగ్


మాట్లాడుతున్న ఎంవీఐ భీమ్‌సింగ్

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 14: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని రామగుండం ఎంవీఐ భీమ్‌సింగ్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా బుధవారం గోదావరిఖని ఆర్‌టీసీ డిపో ఉద్యోగులు నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. అనంతరం డిపోలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోడ్డు మీద వెళ్లేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి ఒక్క ద్విచక్రవాహనదారుడు హెల్మెట్ ధర్మించాలని, వేగం కన్నా ప్రాణం ముఖ్యమని, ఆర్‌టీసీ ఉద్యోగులు బస్సులు నడిపేటప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలని ఆయన సూచించారు. ఉద్యోగులు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ నాగభూషణం, డాక్టర్ ఉదయ్‌కిరణ్, అసిస్టెంట్ మేనేజర్ గీత కృష్ణ, సంధ్యారాణి, డిప్యూటీ సూపరింటెండెంట్ సదానందం, శంకరయ్య, సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ వలీ మహ్మద్, టీకే స్వామి, ఇందిరాదేవి పాల్గొన్నారు.

రైతులను అడ్డుకోవడం మోదీ సర్కారు పిరికి చర్య

సీపీఐఎంఎల్ జిల్లా కార్యదర్శి కె రాజన్న


సమావేశంలో మాట్లాడుతున్న కె రాజన్న

జ్యోతినగర్, ఫిబ్రవరి 14: ఢిల్లీలో ఆందోళన చేయడానికి వెళ్తున్న రైతులను మోదీ ప్రభుత్వం అమానుషంగా అడ్డుకోవడం పిరికి చర్య అని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కె రాజన్న అన్నారు. బుధవారం ఎన్టీపీసీలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో రాజన్న మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా రాజధాని ఢిల్లీలో ఉద్యమించడానికి వెళ్తున్న 200 రైతు సంఘాలను అడ్డుకునేందుకు బాష్పవాయువు ప్రయోగం, లాఠీఛార్జి చేయడం హేయమైన చర్యన్నారు. హర్యానా, పంజాబ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఆరు నెలలకు సరిపడా సరుకులతో బయలుదేరిన వేలాది మంది రైతులపై పోలీసులు విరుచుకుపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ సర్కారు నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగానే ఈనెల 16న దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ బంధు కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్మిక సంఘాలు, కిసాన్ సంయుక్త మోర్చా(ఎస్‌కెఎం) ఆధ్వర్యంలో 16న సమ్మెకు పిలుపునిచ్చాయని, ఈ సమ్మె, గ్రామీణ బందును విజయవంతం చేయాలన్నారు. పోరాటాల ద్వారానే ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాల్సిన పరిస్థితి నెలకొందని, మతోన్మాద, ఫాసిస్టు కేంద్ర ప్రభుత్వానికి సమ్మెతోగుణపాటం చెబుతామన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు ఇ నరేష్, చిలుక శంకర్, బి బుచ్చయ్య, బి కొమరయ్య, తిరుపతి, రాయమల్లు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారుల నిర్లక్ష్యం వల్లనే ప్రమాదాలు

ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు

కోల్‌సిటీ, ఫిబ్రవరి 14: వాహనదారుల నిర్లక్ష్యం వల్లనే రోజు రోజుకు ప్రమాదాలు పెరిగిపోతున్నాయని రామగుండం ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల ముగింపు సందర్భంగా ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో రోజు రోజుకు ప్రమాదాల సంఖ్య పెరిగిపోయి చాలా మంది మృత్యువాత పడుతున్నారని, దేశంలో 2022లో 2లక్షల ప్రమాదాలు జరిగితే 2024లో అది ఐదు రెట్లకు పెరిగి ఏడులక్షల మంది వరకు చనిపోయారన్నారు.

గతంలో రోడ్డు భద్రత వారోత్సవాలు ఉండేవని, డీజీపీ రవిగుప్తా ఆదేశాల మేరకు వాటిని మాసోత్సవాలుగా నిర్వహించడం జరుగుతుందన్నారు. వాహనదారులకు అవగాహన కల్పించేందుకు రామగుండం, మంచిర్యాల, చెన్నూర్, మంథని, బెల్లంపల్లి, లక్సెట్టిపేట ప్రాంతాల్లో అవగాహన సదస్సులు నిర్వహించినట్టు ఆయన చెప్పారు. విలేకరుల సమావేశంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవి, ఎస్ఐ ఉదయ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 14: మండలంలోని పెద్దబొంకూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు శ్రీవినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వసంత పంచమి వేడుకల్లో భాగంగా పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు స్కేల్‌లు పంపిణీ చేశారు. పది పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని వారు విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ మిట్టపల్లి శ్రీనివాస్, కారుపాకల నాగరాజు, దామరకుండ శ్రీనివాస్, మడుపు కృష్ణమాచారి, కొత్తూరి సదానందం, కల్వల తిరుపతి, అజయ్, ఉత్సవ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు సన్మానం

ముత్తారం ఫిబ్రవరి 14: ఇటీవల పదవీకాలం పూర్తయిన ముత్తారం గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ తూటీ రజిత రఫీకి స్థానిక కాంగ్రెస్ నాయకులు బుధవారం శాలువాతో సన్మానం చేశారు. కార్యక్రమంలో మల్యాల బాలు, అనుము సమ్మయ్య, మల్యాల శంకర్, సిద్ధ శ్రీనివాస్, అనుము చిన్న రామస్వామి, మల్యాల పెద్దరాజయ్య, మల్యాల దేవేందర్, కుక్కల చంద్రమౌళి, జక్కుల రాజయ్య, మధురకవి రఘు నారాయణస్వామి, మధురకవి శ్రీనివాస్, వుదరి కృష్ణ, అనుము గోపాలు, చల్ల సమ్మయ్య, తూడ్డల రాజు పాల్గొన్నారు.

ట్రస్మా జిల్లా కార్యవర్గం ఎన్నిక


కంది రవీందర్‌రెడ్డి తిరుపతిరెడ్డి

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 14: తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ట్రస్మా) జిల్లా నూతన కార్యవర్గం బుధవారం ఎన్నికయ్యింది. జిల్లా అధ్యక్షుడిగా కంది రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా చందుపట్ల తిరుపతిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గోదావరిఖనిలోని గీతాంజలి హైస్కూల్‌లో జరిగిన సమావేశంలో జిల్లాలోని పాఠశాలల కరస్పాండెంట్లు హాజరై కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా పరిపాటి అంజారెడ్డి, ఉపాధ్యక్షులుగా పి.సీతారామాచారి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జైన సురేష్, కోశాధికారిగా మహేందర్, జాయింట్ సెక్రెటరీగా బి.తిరుపతి ఎన్నికయ్యారు.

రామగుండం కార్పొరేషన్ కార్యవర్గం

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 14: ట్రస్మా రామగుండం కార్పొరేషన్ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా అదర్‌సండె సమ్మారావు, కొత్త శ్రీనివాస్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం గోదావరిఖనిలో జరిగిన ట్రస్మా జిల్లా కమిటీ సమావేశంలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. ఉపాధ్యక్షులుగా సూర్యదేవ వెంకటేశ్వరరావు, కోశాధికారిగా బోగ నాగరాజు, జాయింట్ సెక్రెటరీగా ఎల్.రవి, కార్యవర్గ సభ్యులుగా ఎండి అబ్దుల్ రహమాన్ షకీర్, ఇమ్మడి మధు, గాలి సునీత ఎన్నికయ్యారు.

బదిలీపై వెళ్తున్న మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం

కోల్‌సిటీ, ఫిబ్రవరి 14: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పని చేసి హైదరాబాద్ జీహెచ్ఎంసీకి బదిలీపై వెళుతున్న సీహెచ్ నాగేశ్వర్‌కు బుధవారం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో మేయర్ బంగి అనీల్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సాగంటి శంకర్, బాల రాజ్‌కుమార్, కన్నూరి సతీష్, డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్, ఆర్ఐ శంకర్‌రావు, సూపరింటెండెంట్ మనోహర్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 14: మండల కేంద్రంలో నాంది చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ట్రస్ట్ 9వ వార్షికోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం సరస్వతి మాతకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన ఇద్దరు వికలాంగులకు వీల్ చైర్స్ అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు బెల్లపుకొండ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992-93సంవత్సరానికి చెందిన 10వ తరగతి విద్యార్థులు ట్రస్ట్‌గా ఏర్పడి 9సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కొల్లూరి హరి ప్రసాద్, చేతి ధర్మేందర్, బాలే శివ ప్రసాద్, నల్ల రాజిరెడ్డి, కాసర్ల మల్లారెడ్డి, అల్లం శంకర్, కత్తుల వీరయ్య, అలుగువెల్లి సంపత్‌రెడ్డి, ఎండీ రసూల్, జక్కుల కుమార్, రానవేన సదయ్య, గుల్బం మునీందర్, పారుపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, చిలువేరి సదయ్య, ఎడ్ల కృష్ణ, చైతన్య, కంది సంతోష్, గోలి నరేష్ పాల్గొన్నారు.



స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణను సద్వినియోగం చేసుకోండి

- ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు

రామగిరి, ఫిబ్రవరి 14: సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో మంచిర్యాల్, మందమర్రి ఏరియాల్లో నిర్వహించే స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కోర్సుల సద్వినియోగం చేసుకోవాలని ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు, ఆర్జీ-3 ఇన్‌చార్జి జీఎం రాధాకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిక్షణ కోర్సులకు మంచిర్యాల, ఆసిఫాబాద్, పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లాల నిరుద్యోగ యువతి, యువకులు అర్హులుగా పేర్కొన్నారు. కేంద్రప్రభుత్వ రీజనల్ డైరెక్టర్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్, తెలంగాణ స్టేట్ మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్ పెన్యూర్‌షిప్ సహకారంతో మొత్తం 8 వృత్తి కోర్సులలో శిక్షణ కల్పించనున్నట్లు పేర్కొన్నారు. కాస్మోటాలజీ, డ్రోన్ టెక్నిషియన్, సోలర్ టెక్నీషియన్, సెల్ టెక్నీషియన్, టూవీలర్ మోకానిక్, ఆర్క్ అండ్ గ్యాస్ వెల్డింగ్, కంప్యూటర్ డీటీపీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ కోర్సులపై శిక్షణ ఉంటుందని తెలిపారు. ఇతర కోర్సులకు డిగ్రీ, డిప్లమా, ఐటీఐ, పదో తరగతి పాసై ఉండాలని పేర్కొన్నారు. ఒక్కొక్క బ్యాచ్‌కు 20 మందికి అభ్యర్థులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. బెల్లంపల్లి, రామగుండం, సింగరేణి రీజియన్ పరిధిలోని బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్, రామగుండం 1,2,3, ఏపీఏ భూపాల్‌పల్లి ఏరియాలకు చెందిన 18 నుంచి 42 సంవత్సరాల వయస్సు గల యువతీయువకులు ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. లేదా మందమర్రి ఎంవీటీసీలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సమ్మెకు కార్మికులు దూరంగా ఉండండి

సీఎండీ బలరాంనాయక్


యూనియన్ నేతలతో మాట్లాడుతున్న జీఎంలు

గోదావరిఖని, ఫిబ్రవరి 14: కొన్ని కార్మిక సంఘాలు ఈ నెల 16న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయని, అందులో భాగంగా సింగరేణి కార్మికులు కూడా సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారని, ఈ సమ్మెకు కార్మికులు దూరంగా ఉండాలని సింగరేణి సీఎండీ బలరాంనాయక్ సూచించారు. ఇందులో ఉన్న డిమాండ్లు సింగరేణి కార్మికులకు సంబంధించినవి కావని, సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉందని, అలాటప్పుడు కార్మికులు ఈ సమ్మెలో పాల్గొనాల్సిన అవసరం లేదని, సమ్మెలోపై కార్మికులు ఆలోచించాలని, ఇప్పటికే వివిధ కారణాల వల్ల ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి, ఓబీ తొలగింపులో వెనుకబడి ఉన్నామన్నారు. ఈ సమయంలో లక్ష్య సాధనకు ప్రతి రోజు సాధించే ఉత్పత్తి కూడా ఎంతో తోడ్పాటునిస్తుందని, ఒక్క రోజు సమ్మె చేస్తే సుమారు రూ.85కోట్లు నష్టం ఉంటుందని, అలాగే కార్మికులు సుమారు రూ.18కోట్ల వేతనాలు కోల్పోతారన్నారు. గత ఆర్థిక సంవత్సరం 2022-23లో 67.14 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తికి గాను 66.69మిలియన్ టన్నుల బొగ్గు రవాణా చేసి రూ.2222కోట్ల లాభాలను ఆర్జించామన్నారు. 16న జరిగే సమ్మెకు కార్మికులు దూరంగా ఉండి సంస్థ అభివృద్ధి సహకరించాలన్నారు.

రామగిరి: ఈ నెల 16న కార్మిక సంఘాలు ఇచ్చిన టోకెన్ సమ్మెకు దూరంగా ఉండాలని ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు, ఆర్జీ-3 ఇన్‌చార్జి జీఎం రాధాకృష్ణ కార్మికులకు పిలుపు నిచ్చారు. జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్మిక సంఘాలు కార్మికుల సమస్యల డిమాండ్ల పరిష్కారానికి చేపట్టే ఒక్కరోజు టోకెన్ సమ్మెకు దూరంగా ఉండాలని కోరారు. టోకెన్ సమ్మె నోటీసులో పేర్కొన్న డిమాండ్‌లు సంస్థ పరిధిలో లేవని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిధిలోని అంశాలుగా కార్మికులు గుర్తించాలని సూచించారు. 16న ప్రతీ ఒక్క కార్మికుడు విధిగా విధులకు హాజరు కావాలని పిలుపునిచ్చారు. సింగరేణి కార్మికులకు ఇతర ప్రభుత్వ రంగ సంస్థలు అమలు చేయని సంక్షేమ కార్యక్రమాలను తీసుకుంటుందన్నారు. తొలుత కార్మిక సంఘాలతో జీఎంలు చర్చించారు. టోకెన్ సమ్మెకు దూరంగా ఉద్యోగులు విధులకు హాజరయ్యే విధంగా చొరవ చూపాలని కోరారు. బొగ్గు డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని బొగ్గు ఉత్పత్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని కోరారు. సమావేశంలో నాయకులు కోట రవీందర్‌రెడ్డి, ఆకుల వెంకన్న, అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటరమణ, అధికారులు నాగేశ్వర్‌రావు, చంద్రశేఖర్, ముప్పిడి రవీందర్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.